నమస్తే తెలంగాణ

నాగర్‌కర్నూల్

10 | మహబూబ్‌నగర్, శనివారం 14 డిసెంబర్ 2024 | NAGARKURNOOL


## ఉడకని అన్నం పెడుతున్నారు..



పాఠశాలలో ప్రతి రోజూ మధ్యాహ్న భోజనంలో అన్నం సరిగా ఉడకటం లేదు. రాళ్లు, పురుగులు వస్తున్నా యి. ఈ అన్నం తిని కడుపు నొప్పితో బాధపడుతున్నాం. ఎవరికి చెప్పినా పట్టించుకోవడం లేదు. **– కృష్ణచైతన్య, పదో తరగతి విద్యార్థి, గ్రౌండ్ స్కూల్, నారాయణపేట**

## గుడ్లు బంద్ చేసిండ్రు..



పాఠశాలలో రెండు నెలలుగా మధ్యాహ్న భోజనంలో గుడ్లు ఇవ్వడం లేదు. గతంలో వారంలో మూడు రోజులు గుడ్లను అందించేవారు. గుడ్లు ఇవ్వడమేమోగానీ నాణ్యమైన భోజనం పెట్టడం లేదు. మధ్యాహ్న భోజనం తినలేకపోతున్నాం. **–నర్సింహ, 8వ తరగతి, గ్రౌండ్ స్కూల్, నారాయణపేట**



నారాయణపేట జీహెచ్‌ఎస్‌లో ఇంటి నుంచి తెచ్చుకున్న భోజనాన్ని తింటున్న విద్యార్థినులు

# ఇంటి నుంచే.. లంచ్‌బాక్స్‌

- మధ్యాహ్న భోజనంలో పురుగుల అన్నం, నీళ్ల చారు
- తరచూ అనారోగ్యాల పాలవుతున్న విద్యార్థులు
- ఆందోళన చెందుతున్న తలిదండ్రులు
- 880 మంది ఉన్న పాఠశాలలో 200 మందికిపైగా లంచ్ బాక్సులతో హాజరు
- అధికారుల తనిఖీలో వెలుగులోకి..

నారాయణపేట రూరల్, డిసెంబర్ 13 : గురుకులాలు.. వసతి గృహాలు.. పాఠశాలల్లో పేద విద్యార్థులకు అందించే భోజనాన్ని సైతం విషంగా మారుస్తున్నారు.. కూలి నాలి చేసుకొని మా కష్టం మా పిల్లలకు రావొద్దని సర్కారు బడికి పంపిస్తున్న తల్లిదండ్రులకు ప్రతి రోజూ గుబులే. ఉడికీ ఉడకని అన్నం.. నీళ్ల చారు.. మురిగి పోయిన కూరగాయలతో కూరలు.. కుళ్లిపోయిన కోడిగుడ్లను పెట్టి పేదల విద్యార్థుల పొట్ట కొట్టడమే కాకుండా వారి ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. కాంగ్రెస్ సర్కారు వచ్చాక ఇటీవలి కాలంలో ఉమ్మడి జిల్లాలో వెలుగు చూసిన ఫుడ్ పాయిజన్ ఘటనలే ఇందుకు నిదర్శనం. పదేండ్ల బీఆర్‌ఎస్ పాలనలో సంక్షేమ హాస్టళ్లు, పాఠశాలల్లో కడుపునిండా నాణ్యమైన భోజనం తిన్న విద్యార్థులు నేడు ఇంటి నుంచే లంచ్ బాక్స్‌లను తీసుకెళ్లాల్సిన దుస్థితి నెలకొన్నది. సర్కారు బడిలో అందించే భోజనంపై నమ్మకం లేక విద్యార్థుల తల్లిదండ్రులు ఇంటి నుంచే భోజనం పంపిస్తున్నారు.

నారాయణపేట గ్రౌండ్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు పురుగులు, రాళ్లతో కూడిన మధ్యాహ్న భోజనం వడ్డించడంతో విద్యార్థుల తల్లిదండ్రులు భయాందోళనకు గురై శుక్రవారం ఇంటి నుంచే లంచ్ బాక్స్‌లను పంపించారు. 880 మంది విద్యార్థులున్న పాఠశాలలో దాదాపుగా 200మంది లంచ్ బాక్సులతో హాజరైనట్లు అధికారుల తనిఖీల్లో వెలుగు చూసింది.



నారాయణపేట జీహెచ్‌ఎస్‌లో లంచ్ బాక్సులతో పాఠశాలకు వచ్చిన విద్యార్థినులు



సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే విజయుడు, ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి

# ప్రతి గ్రామం అభివృద్ధి చెందాలి

- అలంపూర్‌ఎమ్మెల్యే విజయుడు, ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి
- సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందజేత

అలంపూర్ చౌరస్తా, డిసెంబర్ 13 : అలంపూర్ నియోజకవర్గంలోని ప్రతి గ్రామం అభివృద్ధి చెందాలని ఎమ్మెల్యే విజయుడు, ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి అన్నారు. శుక్రవారం ఉండవెల్లి, రాజోళి మండలాల్లో వారు పర్యటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతిపల్లె అభివృద్ధి దిశగా నడవాలని, ముఖ్యంగా సమస్యలు లేని గ్రామాలుగా తీర్చిదిద్దడమే తమ ధ్యేయమని, మీలో ఎవరికీ ఏ సమస్య వచ్చినా మమ్మల్ని కలువవచ్చని ప్రజలకు సూచించారు. అనంతరం రాజోళి మండలంలో పలు గ్రామాల లబ్ధిదారులకు వారు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను అందజేశారు. రాజోళికి చెందిన రామచంద్రరెడ్డికి రూ.55,500, సుందర్‌రాజుకు రూ.16,500, శాంతమ్మకు రూ.27 వేలు, మౌలాలికి రూ. 36 వేలు, తిమ్మారెడ్డికి రూ.39 వేలు చొప్పున మొత్తం రూ.1.74 లక్షల చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు ఉన్నారు.

# ప్రైవేటీకరణ చేస్తే సహించేది లేదు



దోమలపెంటలోని సర్కిల్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న విద్యుత్ ఉద్యోగులు

- విద్యుత్ ఉద్యోగుల నిరసన

దోమలపెంట, డిసెంబర్ 13 : ఉత్తరప్రదేశ్, ఛత్తీస్‌ఘడ్‌లోని విద్యుత్ సంస్థలను ప్రైవేటీకరించాలనే నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ ఈగలపెంట టీజీ జెన్‌కోలో శుక్రవారం తెలంగాణ పవర్ ఎంప్లాయిస్ జేఏసీ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. అనంతరం సర్కిల్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో తెలంగాణ పవర్ ఎంప్లాయిస్ జేఏసీ చైర్మన్ సునీల్ మాట్లాడుతూ విద్యుత్ సంస్థలను ప్రైవేటీకరణపై సంస్థల్లో పనిచేస్తున్న ఉద్యోగులకు ఉద్యోగ భద్రత ఉండదని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే పేదలకు ఇస్తున్న విద్యుత్ క్రాస్ సబ్సిడీలు ఎత్తివేస్తారని ఆరోపించారు. ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా విద్యుత్ ఉద్యోగులందరూ ఐక్య ఉద్యమం చేయాలని పిలుపునిచ్చారు. ఇందులో భాగంగా ఈనెల 19వ తేదీన నిరసన కార్యక్రమం ఉంటుందని, విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో తెలంగాణ పవర్ ఎంప్లాయీస్ జేఏసీ నాయకులు రామ్మోహన్ రావు, నరేందర్, సందీప్‌రెడ్డి, అశోక్, లవకుమార్, వంశీ, పండు నాయక్, విజయ, చంద్రికతోపాటు విద్యుత్ ఉద్యోగులు ఉన్నారు.

# ఎమ్మెల్యేలు క్షమాపణ చెప్పాలి




పాలమూరు యూనివర్సిటీ ఎదుట ఆందోళన చేస్తున్న బీఆర్‌ఎస్వీ నాయకులు

- బీఆర్‌ఎస్వీ పాలమూరు యూనివర్సిటీ కన్వీనర్ భరత్‌బాబు

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, డిసెంబర్ 13 : జాగృతి వ్యవస్థాపక అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కవితపై మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య మాట్లాడిన మాటలను వెంటనే వెనక్కి తీసుకొని క్షమాపణలు చెప్పాలని బీఆర్‌ఎస్వీ పాలమూరు యూనివర్సిటీ కన్వీనర్ భరత్‌బాబు డిమాండ్ చేశారు. శుక్రవారం పీయూ ప్రధాన ముఖ ద్వారం ఎదుట బీఆర్‌ఎస్వీ నాయకులు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా భరత్‌బాబు మాట్లాడారు. తెలంగాణ ఉద్యమంలో కల్వకుంట్ల కవిత జాగృతి అధ్యక్షురాలిగా ఊరూరా తిరిగి సంస్కృతి, సంప్రదాయాలను ప్రోత్సహిస్తూ బతుకమ్మ వేడుకలతో సబ్బండ వర్గాలను ఏకం చేశారన్నారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు తెలంగాణ రాష్ట్ర ఏర్పా టు ఆవశ్యకతను పరిచయం చేసి, ప్రపంచ స్థాయి వేదికలపై బతుకమ్మను నిలబెట్టిన ఘనత కవితక్కకు దక్కుతుందన్నారు. మహిళ అనే గౌరవం లేకుండా అనుచితంగా ఎమ్మెల్యేలు మాట్లాడడం సిగ్గుచేటని, వెంటనే బహిరంగ క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే 70శాతం గ్రామాల్లో బతుకమ్మ ఆడరని చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. తెలంగాణ తల్లి విగ్రహాన్ని మార్చడం, చేతిలో ఉన్న బతుకమ్మను తీసేసి హస్తం గుర్తును చూపిస్తున్న తెలంగాణ తల్లిని ఏర్పాటు చేయడాన్ని చూసి ప్రజలు పెద్ద ఎత్తున విమర్శిస్తున్నారన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్వీ నాయకులు రామకృష్ణ, గౌస్, విష్ణు, శశికుమార్, వికాస్, మల్లేశ్, నాగరాజు, దిలీప్, శివ, లక్ష్మణ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# బాయిలర్‌లోకి మత్తు పదార్థాలు

మహబూబ్‌నగర్ , డిసెంబర్ 13 : ఉమ్మడి జిల్లాలో సంవత్సర కాలంగా పట్టుబడిన దాదాపు రూ.2కోట్ల విలువ చేసే నిషేధిత మత్తు పదార్థాలను ఎక్సైజ్ అధికారులు శుక్రవారం ధ్వంసం చేసినట్లు ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. మహబూబ్‌నగర్ జిల్లాలోని 10 ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్లలో సంవత్సర కాలంలో 24కేసుల్లో పట్టుబడిన 10కేజీల ఎండు గంజాయి, 11 గంజాయి మొక్కలు, 16 కేజీ ల ఆల్ప్రాజోలం, 1.5 కేజీల డైజోఫాం, 5 కేజీల హాశీష్ ఆయిల్‌ను రంగారెడ్డి జిల్లాలోని జీజే మల్టీకేవ్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీకి వెళ్లి బర్నింగ్ బాయిలర్‌లో వేసి కాల్చివేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏఈఎస్ శ్రీనివాస్, నరసింహారెడ్డి, ఎక్సైజ్ సీఐలు వీరారెడ్డి, కల్యాణ్ పాల్గొన్నారు.



పట్టుబడిన మత్తుపదార్థాలతో ఎక్సైజ్ అధికారులు

# నాణ్యమైన భోజనమంటే ఇదేనా?

- నీళ్ల చారు, ఉడికీ ఉడకని అన్నం పెడుతారా?
- విద్యార్థులతో జీవితాలతో చెలగాటమాడితే సహించేది లేదు
- నారాయణపేట, మక్తల్‌లో రాష్ట్ర ఫుడ్ కార్పొరేషన్ కమిషన్ తనిఖీలు
- అధ్వాన మధ్యాహ్న భోజనంపై అసహనం
- అధికారులు, వంట ఏజెన్సీపై ఆగ్రహం
- పెండింగ్ బిల్లులపై ప్రశ్నించిన వంట ఏజెన్సీలు

ఊట్కూర్, మక్తల్ డిసెంబర్ 13 : నీళ్ల చారు.. ఉడికీ ఉడకని అన్నం.. అపరిశుభ్రంగా ఉన్న వంట గదులు, కుళ్లిపోయిన కూరగాయలు ఇలాగేనా విద్యార్థులకు అందించే నాణ్యమైన ఆహారమంటూ రాష్ట్ర ఫుడ్ కమిషన్ సభ్యులు అధికారులు, వంట ఏజెన్సీ నిర్వాహకులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉమ్మడి జిల్లాలో కొన్నాళ్లుగా గురుకుల విద్యాలయాలు, పాఠశాలల్లో చోటుచేసుకుంటున్న విద్యార్థుల వరుస ఫుడ్ పాయిజన్ సంఘటనలతో రాష్ట్ర ఫుడ్ కార్పొరేషన్ కమిషన్ చైర్మన్ గోళి శ్రీనివాస్‌రెడ్డి, కమిటీ సభ్యుల బృందం శుక్రవారం మక్తల్ మండలంలో పర్యటించింది. ముందుగా గుడిగండ్ల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేశారు. విద్యార్థులకు వండిన మధ్యాహ్న భోజనంపాటు వసతులను పరిశీలించారు. నాసిరకం అల్లం పేస్టు, నాణ్యత లేని ఉప్పు, కారం, పసుపును చూసి వంట ఏజన్సీలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అల్లం పేస్టు నుంచి దుర్గంధం వస్తుందని.. ఇలాంటి వాటితో వండితే ఎలాగని ప్రశ్నించారు. హెచ్‌ఎం, ఉపాధ్యాయులు జాగ్రత్తగా ఉండాలని, పాఠశాలలో ఫిర్యాదు బాక్స్‌ను ఏర్పాటు చేయాలని హెచ్‌ఎం హిమబిందును ఆదేశించారు. పాఠశాల ఆవరణలో విద్యార్థులకు ఏర్పాటు చేసిన వాటర్ ట్యాంకులను పరిశీలించారు. జక్లేర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నీళ్ల చారు, బిరుసుకుపోయిన అన్నం వడ్డిస్తున్నట్లు గుర్తించారు. పామాయిల్ వాడుతున్నారని, ఇలాంటి వంటలను విద్యార్థులు ఎలా తింటారని ప్రశ్నించారు. మధ్యాహ్నం 2:15 గంటలకు మక్తల్ జ్యోతిబాపూలే బాలికల గురుకుల పాఠశాల, కళాశాలను తనిఖీ చేశారు. బూజు, కుళ్లిపోయిన సోర కాయలను గుర్తించి పార వేయించారు. వంటలు ఏమాత్రం నాణ్యత, రుచిగా లేవన్నారు. ఇకపై నాణ్యమైన భోజనం అందించాలని ప్రిన్సిపాల్ రేవతికి సూచించారు. అనంతరం స్థానిక ఎల్లమ్మకుంటలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేసి చిన్నారులకు అందిస్తున్న పౌష్టికాహారంతోపాటు బరువులను పరిశీలించారు. వారం రోజుల నుంచి గుడ్లు సరఫరా లేదని గుర్తించారు. పట్టణంలోని గంజ్ సమీపంలో చౌకధర దుకాణాన్ని తనిఖీ చేసి బియ్యం స్టాక్‌ను పరిశీలించారు. విద్యార్థుల ఆరోగ్యంపై నిర్లక్ష్యం చేస్తే సహించేది లేదని, బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకుంటామని ఫుడ్ కార్పొరేషన్ చైర్మన్ గోళి శ్రీనివాస్‌రెడ్డి, బృందం సభ్యులు గోవర్ధన్‌రెడ్డి, భారతి, జ్యోతి, శారద మీడియా సమావేశంలో వెల్లడించారు. కాగా, బృందం సభ్యులు గుడిగండ్ల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు మధ్యాహ్నం 12:40 గంటలకు, జక్లేర్ జెడ్పీహెచ్ పాఠశాలను మధ్యాహ్నం 1:30 గంటలకు సందర్శించారు. వారు వచ్చే వరకు విద్యార్థులకు భోజనాలను వడ్డించకుండా అలాగే ఉంచారు.

**ముందు బిల్లుల సంగతి తేల్చండి..**

మండలంలోని జక్లేర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలను సందర్శించిన ఫుడ్ కార్పొరేషన్ చైర్మన్ బృందం సభ్యులను వంట ఏజన్సీలు నిలదీశాయి. రెండు నెలల నుంచి తమకు వంట బిల్లులు రాలేదని, వంట మనుషులకు నెలకు రూ.3వేలు ఇవ్వాల్సి ఉండగా, రూ.వెయ్యి మాత్రమే ఇస్తున్నారని తెలిపారు. నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరిగాయని, గుడ్డు ధర రూ.7 ఉండగా మీరిచ్చేది దేనికీ సరిపోవడం లేదని నిలదీశారు. ఇందుకు స్పందించిన కమిషన్ బృందం మీరు ఎన్నాళ్ల నుంచి వంట చేస్తున్నారని ప్రశ్నించారు. 20ఏండ్ల నుంచి చేస్తున్నామని చెప్పడంతో అప్పటి నుంచి రాని నష్టం ఇప్పుడే వచ్చిందా అని ఆగ్రహం వ్యక్తం చేస్తూ అంత నష్టం అనిపిస్తే మానుకోవాలన్నారు. బృందం వెంట ఆర్డీవో రాంచందర్, డీఈవో గోవిందరాజులు, సివిల్ సప్లయ్ జిల్లా అధికారి దేవదానం, డీడబ్ల్యూవో జయ, సీడీపీవో సరోజిని, డీఆర్‌డీవో మొగులప్ప, తాసీల్దార్ సతీశ్‌కుమార్, ఎంపీడీవో రమేశ్, మిడ్ డే మీల్స్ అధికారి యాదయ్యశెట్టి పాల్గొన్నారు.



జక్లేర్‌లో మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేస్తున్న ఫుడ్ కమిషన్ అధికారులు

**నాణ్యత పాటించకుంటే చర్యలు తప్పవు..**

నారాయణపేట రూరల్, డిసెంబర్ 13 : నారాయణపేట జిల్లా కేంద్రంలోని గ్రౌండ్ ఉన్నత పాఠశాలను శుక్రవారం రాష్ట్ర ఫుడ్ కార్పొరేషన్ కమిషన్ చైర్మన్ గోళి శ్రీనివాస్‌రెడ్డి బృందం తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనానికి సంబంధించి నాణ్యమైన బియ్యం అందించాలని హెచ్‌ఎం దత్తురావును ఆదేశించారు. పాఠశాలకు గుడ్లు సరిగా సరఫరా కాకపోవడంపై ప్రశ్నించారు. మెనూ ప్రకారం భోజనం పెట్టడం లేదని విద్యార్థులు చెప్పడంతో వంట ఏజెన్సీ నిర్వాహకులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తమకు బిల్లులు రావడం లేదని ఏజెన్సీ నిర్వాహకులు తెలిపారు. మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో రాంచందర్, డీఈవో గోవిందరాజులు వారి వెంట ఉన్నారు. కాగా, అలాగే ఉదయం పరీక్షల విభాగం అధికారి రాజేంద్రకుమార్ పాఠశాలను తనిఖీ చేసి బియ్యం నిల్వలను పరిశీలించారు. నాణ్యతగా లేక పోవడంతో వెం టనే బియ్యం మార్చాలని నిర్వాహకులకు సూ చించారు. మున్సిపల్ కమిషనర్ సునీత, మండల ప్రత్యేకాధికారి రంగారావు, తాసీల్దార్ అమరేందర్‌కృష్ణ, డీటీ రామకృష్ణ, కాళప్ప, ఆర్‌ఐ ప్రతాప్‌రెడ్డి పాఠశాలను సందర్శించి విద్యార్థులతో కలిసి భోజనం చేశారు.



విద్యార్థినులతో మాట్లాడుతున్న ఫుడ్ కమిషన్ చైర్మన్ గోళి శ్రీనివాస్‌రెడ్డి

**ఆహార భద్రత హక్కుకు భంగం కలుగకుండా చూడాలి**

నారాయణపేట టౌన్, డిసెంబర్ 13 : ఆహార భద్రత హక్కుకు భంగం కలుగకుండా చూడాలని రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోళి శ్రీనివాస్‌రెడ్డి అధికారులకు సూచించారు. శుక్రవారం పట్టణంలోని కలెక్టరేట్‌లో కలెక్టర్ సిక్తా పట్నాయక్‌తో కలిసి సమీక్షా సమావేశంలో మాట్లాడారు. జాతీయ ఆహార భద్రత చట్టం అమలులో భాగంగా కమిషన్ రాష్ట్ర వ్యాప్తంగా పర్యటిస్తూ పర్యవేక్షిస్తుందన్నారు. మక్తల్ మండలంలో కమిషన్ సభ్యులతో కలిసి పాఠశాలలో మధ్యాహ్న భోజనం నాణ్యత, అంగన్‌వాడీలు, వసతి గృహాలు, నిత్యావసర సరుకుల పంపిణీ వ్యవస్థకు సంబంధించి తనిఖీలు నిర్వహించామన్నారు. ఒకటి రెండు చోట్ల విద్యార్థులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆహారం విషయంలో మెనూ ప్రకారం లేకపోవడంపై సంబంధిత సంక్షేమ వసతి గృహ సంరక్షకులు, పాఠశాలల హెచ్‌ఎంలు లోపాలను సరిచేసుకొని నాణ్యమైన ఆహారం అందించాలన్నారు. కలెక్టర్ సిక్తా పట్నాయక్ మాట్లాడుతూ జాతీయ ఆహార భద్రత చట్టం 2013ను సమర్థవంతంగా అమలు చేసేందుకు జిల్లా అధికార యంత్రాంగం పూర్తి చర్యలు తీసుకుంటుందని తెలిపారు. మెనూ ప్రకా రం హాస్టళ్లలో పౌష్టికాహారం అందేలా పర్యవేక్షణ చేస్తామన్నారు. సమావేశంలో కమిషన్ సభ్యులు గోవర్ధన్‌రెడ్డి, రంగినేని శారద, బుక్యజ్యోతి, భారతి, అదనపు కలెక్టర్ బెన్‌శాలామ్, ఆర్డీవో రాంచందర్ తదితరులు పాల్గొన్నారు.



నారాయణపేటలో విద్యార్థులతో మాట్లాడుతున్న విద్యాధికారి

# మట్టిని తోడేస్తున్నారు..

- గద్వాల జిల్లాలో రెచ్చిపోతున్న మట్టి మాఫియా
- పట్టపగలే అక్రమంగా తవ్వకాలు
- చోద్యం చూస్తున్న అధికారులు

గద్వాల అర్బన్, డిసెంబర్ 13 : జోగుళాంబ గద్వాల జిల్లాలో మట్టి మాఫియా రెచ్చిపోతున్నది. ఏ గుట్ట కనిపించినా రాత్రికి రాత్రే మాయం చేస్తున్నారు. చర్యలు తీసుకోవాల్సిన అధికారులు తమకేమీ పట్టనట్లు వ్యవహరించడంతో మట్టి మాఫియా ఆగడాలకు అంతే లేకుండా పోతున్నది. అధికారులకు నెలవారిగా మామూళ్లు ముట్టజెప్పుతుండడంతో పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు వినబడుతున్నాయి. శుక్రవారం గద్వాల మండలం అనంతపురం సమీపంలో అధికార పార్టీకి చెందిన ఓ రాజకీయ నాయకుడు అక్రమంగా మట్టి తరలిస్తున్నట్లు వచ్చిన విశ్వసనీయ సమాచారం మేరకు.. మైన్స్, రెవెన్యూ, పోలీస్ అధికారులు సంయుక్తంగా తనిఖీలు నిర్వహించి మట్టిని తరలిస్తున్న టిప్పర్‌ను సీజ్ చేసి జరిమానా విధించారు. అయితే ఘటనా స్థలంలో ఇంకా మట్టి టిప్పర్లు ఉండగా, వాటిని పట్టుకోకపోవడంపై సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. అధికార పార్టీలో ఓ కీలక నాయకుడి ఒత్తిడితో అధికారులు ఒక టిప్పర్‌ను పట్టుకొని జరిమానా విధించి మిగతా వాటిని వదిలేసినట్లు ఆరోపణలు వినబడుతున్నాయి. అధికార పార్టీలో మట్టి తరలించే మాఫియా గ్రూప్‌లుగా డజన్ సంఖ్యలో ఉన్నట్లు సమాచారం. ఏ గుట్ట కనపడినా వారం తిరిగి చూసేసరికి మాయం చేస్తున్నారు. అక్రమంగా మట్టిని తరలిస్తుండగా, వీరిని పట్టుకోకుండా ఉండేందుకు అధికార పార్టీలో ఓ నాయకుడు కీలక పాత్ర పోషిస్తున్నట్లు సమాచారం. మట్టిని తరలించే వారిపై ఎలాంటి చర్యలు తీసుకోవద్దని అధికారులపై ఒత్తిడి తెస్తూ అధికారులకు నెలవారిగా మాముళ్లు ఫిక్స్ చేసినట్లు గుసగుసలు వినబడుతున్నాయి.



మట్టిన తరలిస్తున్న టిప్పర్

## చర్యలు తీసుకుంటాం..

మైన్స్, రెవెన్యూ, పోలీస్ అధికారులు సంయుక్తంగా తనిఖీలు చేసి టిప్పర్‌ను పట్టుకున్నాం. టిప్పర్ యాజమాని సుబ్బరావుకు 10 వేల జరిమానా విధించాం. అధికారులు పట్టించుకోవడం లేదనేది అవాస్తవం. అక్రమంగా ఇసుక, మట్టి తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. **–వెంకటరమణ, జిల్లా మైనింగ్ శాఖ అధికారి**

## ఇద్దరు ఉపాధ్యాయులకు మెమోలు జారీ

దేవరకద్ర, డిసెంబర్ 13 : మండలకేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో సమయపాలన పాటించని ఇద్దరు ఉపాధ్యాయులకు మెమోలు జారీ చేసినట్లు ఎంఈవో బలరాం తెలిపారు. శుక్రవారం ఎంఈవో మాట్లాడుతూ మండల కేంద్ర ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం ఆంజనేయులు, ఉపాధ్యాయుడు సుదర్శన్‌గౌడ్ శుక్రవారం ఉదయం పాఠశాల ప్రార్థన సమయానికి హాజరుకాకుండా 9:40 గంటలకు పాఠశాలకు రావడంతో ఇద్దరికీ మెమోలు జారీ చేసినట్లు ఎంఈవో పేర్కొన్నారు.

## ఏటీఎంను ధ్వంసం చేసిన వ్యక్తికి రిమాండ్

నారాయణపేట, డిసెంబర్ 13 : పట్టణంలోని కేబీఎస్ బ్యాంకు పక్క ఉన్న ఏటీఎంను గురువారం రాత్రి ధ్వంసం చేసిన వ్యక్తిని స్థానిక పోలీసులు పట్టుకొని రిమాండ్ తరలించారు. సీఐ శివశంకర్ తెలిపిన వివరాల ప్రకారం పట్టణంలోని కుర్వగేరికి చెందిన మల్లేశ్ గురువారం రాత్రి 11గంటల సమయంలో కేబీఎస్ బ్యాంక్ ఏటీఎంను ధ్వంసం చేసి అందులోని నగదును తస్కరించేందుకు ప్రయత్నించాడు. అయితే ఏటీఎంను ధ్వంసం చేసినా అందులోని డబ్బును తీసుకోలేకపోయాడు. బ్యాంక్ మేనేజర్ బాలవెంకటన్న ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేపట్టిన పోలీసులు రెండు గంటల్లోనే నిందితుడిని పట్టుకున్నారు. అతని వద్ద నుంచి కొడవలిని స్వాధీనం చేసుకొని రిమాండ్ తరలించినట్లు సీఐ తెలిపారు. రెండు గంటల్లోనే కేసును ఛేదించిన టౌన్ ఎస్సై వెంకటేశ్వర్లు, రెండో ఎస్సై కృష్ణదేవ్, సిబ్బంది ఉన్నారు.